స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపిక

కులకచర్ల, జూన్ 29: హకీంపేట్ క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశానికి జూలై 1న చౌడాపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో, 2న కులకచర్ల బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల ఎంపిక జరుగనున్నట్లు ఎంఈవో హబీబ్ అహ్మద్ శనివారం తెలిపారు. మూడో తరగతి పాసైనవారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు బోనఫైడ్, ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్‌ను వెంట తీసుకుని ఎంపికకు హాజరు కావాలన్నారు.

కార్మికులంటే పరిశ్రమల యాజమాన్యాలకు లెక్కే లేకుండా పోయింది. తరచూ ప్రమాదాలు జరిగి అనేకమంది ప్రాణాలు గాలిలో కలుస్తున్నా వాటి నివారణ చర్యలు చేపట్టడం లేదు. కొన్నిసార్లు కార్మికుల మృతదేహాలను గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. పరిశ్రమల్లో కనీస రక్షణ చర్యలు చేపట్టకున్నా అధికారులు వాటి గురించి పట్టించుకోవడం లేదు. అసలు అధికారులు పరిశ్రమల వైపు కన్నెత్తి చూడడమే మానేశారు. దీంతో పరిశ్రమల యాజమాన్యాలది ఆడింది ఆట.. పాడింది పాటగా తయారైంది. వీరందరి నిర్లక్ష్యానికి కార్మికులు బలవుతున్నారు.



ప్రమాదానికి గురైన సౌత్ గ్లాస్ పరిశ్రమ

కార్మికుల ప్రాణం దైవాధీనం!

పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు

వందల మంది కార్మికుల మృతి

ఒక్క షాద్‌నగర్ నియోజకవర్గంలోనే పదేళ్లలో అధికార లెక్కల ప్రకారం వందలాది మంది కార్మికులు మృతి చెందారు. చిన్న చిన్న సంఘటనలో మృతి చెందిన వారిని యాజమాన్యాలు గుట్టుచప్పుడు కాకుండా వారి స్వగ్రామాలకు తరలించిన సంఘటనలూ ఉన్నాయి. 2014లో కొత్తూరు పారిశ్రామికవాడలో జరిగిన ప్రమాదంలో సుమారు 60 మంది కార్మికులు మరణించారు. అలాగే ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామం వద్ద ఉన్న స్టీమ్‌కోర్ పరిశ్రమలో ఒకే సారి 10మంది కార్మికులు దుర్మరణం చెందారు. 2022లో బూర్గుల గ్రామ పరిధిలోని కలర్ పరిశ్రమలో ఏడుగురు కార్మికులు చనిపోయినట్లు సమాచారం. ఇలా పరిశ్రమలో ప్రమాదాలు జరుగుతున్నా అధికారగణం మాత్రం యాజమాన్యాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

దినదిన గండంగా..

పరిశ్రమల్లోని కార్మికుల బతుకులు దినదిన గండంగా మారుతున్నాయి. అత్యంత ప్రమాదకరమైన పరికరాల వద్ద పనిచేస్తున్న కార్మికులకు పరిశ్రమల యాజమాన్యాలు రక్షణ పరికరాలు అందజేయడం లేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అన్న ఆందోళనతో కాలం వెళ్లదీస్తున్నారు. ప్రధానంగా స్పాంజ్ ఐరన్ పరిశ్రమలో అత్యంత వేడితో తయారు చేసే ఇనుము కోసం ఉపయోగించే బ్లాస్టెడ్ ఫర్నెస్, ఫర్నెస్ లాంటి పరికరాల వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ప్రతీ సంవత్సరం పదుల సంఖ్యలో కార్మికులు మృతి చెందడం, 10 నుంచి 20 మంది వరకు గాయాల పాలవ్వడం జరుగుతుంది. అలాగే ఫార్మా పరిశ్రమలో మందుల తయారీకి ఉపయోగించే రియాక్టర్ పరికరాలు పేలి కూడా పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం జరుగుతుంది. అందులో ఉండే మంటలు కార్మికుల చర్మంపై పడి తీవ్ర గాయాల పాలవుతున్నారు. గ్లాస్ పరిశ్రమలో అద్దాల తయారీ కోసం ఆటోక్లేవ్ పరికరాన్ని ఉపయోగిస్తారు. ఇందులో గ్యాస్‌తో పాటు గాలి నిండి ఉంటుంది. అద్దాలు తయారు చేసేటప్పుడు గ్యాస్, ఎయిర్‌తో కలిపి కేవలం 13 కిలోల బరువు మాత్రమే ఉండాలి. అందుకోసం ప్రతి 10 నిమిషాలకు ఒకసారి దానిని పరిశీలిస్తూ 13 కేజీలకు మించకుండా ఆపరేటర్ జాగ్రత్త తీసుకోవాలి. శుక్రవారం జరిగిన సౌత్ గ్లాస్ పరిశ్రమలో ఆటోక్లేవ్ పరికరం 30 కేజీల వరకు చేరుకోవడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలిసింది.



పేలిన రియాక్టర్

- కానరాని రక్షణ పరికరాలు
- అందుబాటులో లేని అంబులెన్సులు
- శ్రద్ధ చూపని యాజమాన్యాలు
- మృత్యువాత పడుతున్న కార్మికులు
- చోద్యం చూస్తున్న అధికారులు
- 10 ఏళ్లలో వందమందికి పైగా మృతి
- గుట్టుచప్పుడు కాకుండా శవాల తరలింపు

షాద్‌నగర్/షాద్‌నగర్ రూరల్, జూన్ 29: కార్మికులకు చట్టాలు ఉంటాయి.. కానీ అవి కనుచూపు మేరలో కూడా కనిపించవు.. తనిఖీలకు అధికారులు ఉంటారు.. కానీ నెల నెలా తనఖా తీసుకుని కుర్చీలో నిద్రపోతుంటారు.. చట్టాలన్నీ యాజమాన్యాలకు చుట్టాలుగా మారడంతో పరిశ్రమలో జరిగే ఘోర ప్రమాదాలు కార్మికుల జీవితాను కాలగర్భంలో కలిపేస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా బూర్గుల శివారు చింతగూడ గ్రామ పరిధిలోని సౌత్ గ్లాస్ పరిశ్రమలో చోటు చేసుకున్న సంఘటన మరోసారి ఈ విషయాన్ని స్పష్టం చేసింది. పరాయి రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు ఒక్క పేలుడు ఘటనతో చితికిపోయి చితికి చేరారు.

హృదయాలను కలిచివేసిన ప్రమాదం

క్షణ కాలంలో జరిగిన ప్రమాదంలో మాసంపు ముద్దలా మారిన శరీరాలు.. ఎవరి శరీర భాగాలు ఏవో అర్థం కాకుండా ఎక్కడపడితే అక్కడ పడిపోయిన కాళ్లు, చేతులు, మొండెం భాగాలు.. తమ కళ్లముందే కన్నుమూసిన కార్మికులను చూస్తూ మిన్నంటిన సహ కార్మికుల హాహాకారాలు..ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని పరుగులు తీసిన ఘటనలు.. శుక్రవారం రాత్రి సౌత్ గ్లాస్ పరిశ్రమలో కనిపించిన దృశ్యాలివి. ఇలాంటి ప్రమాదకర పని ముట్ల దగ్గర పని చేస్తున్న కార్మికులకు భద్రత, రక్షణ పరికరాలు అందించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉంది. కానీ వీళ్లు కార్మికుల గోడు పట్టించుకోవడం లేదు. కార్మికుల ప్రాణాలంటే వీరికి లెక్క లేదు. దీనిని తనిఖీ అప్రమత్తత కార్మిక శాఖ అధికారులు సైతం వారి గోడు పట్టించుకోలేదు. ఫలితంగా జరిగిన దారుణం కార్మికులను విగత జీవులుగా మార్చింది.



పేలుడు ధాటికి అక్కడికక్కడే మృతి చెందిన కార్మికుడు

త్రుటిలో తప్పిన భారీ అగ్ని ప్రమాదం

ఆటోక్లేవ్ యంత్రాన్ని పరిశ్రమలో పూర్తిగా కిందిస్థాయిలో బిగించారు. పేలుళ్లు కూడా కింది స్థాయిలోనే జరిగాయి. అదే గనుక కొంచెం ఎత్తులో ఉంటే అక్కడే ఉన్న విద్యుత్ పరికరాలకు తగిలి భారీ అగ్ని ప్రమాదం సంభవించడంతో పాటు, పరిశ్రమ కూడా పూర్తిగా దగ్ధమయ్యే పరిస్థితి ఉండేదని పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. పేలుళ్ల ధాటికి పరిశ్రమలో ఉన్న గ్లాస్ కూడా నేలమట్టమయిందని తెలిపారు.

అనుభవం లేని వారితో పనులు

పరిశ్రమల్లో అన్‌స్కిల్డ్ కార్మికులతో యంత్రాల వద్ద పని చేయిస్తుండటంతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. స్కిల్డ్ కార్మికులకు అధిక వేతనాలు చెల్లించాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే యాజమాన్యాలు అనుభవం లేని కార్మికులతో పని చేయిస్తున్నారు. దీంతో పాటు ప్రతి కార్మికుడి భద్రత కల్పించాల్సిన యాజమాన్యం ఈ విషయంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతోనే పరిశ్రమల్లో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. కార్మికుల సంక్షేమం పట్ల లేబర్ శాఖ అధికారులు కూడా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

జిల్లాలో 3,474 పరిశ్రమలు

రంగారెడ్డి జిల్లాల్లో భారీ, మధ్య తరహా పరిశ్రమలు 3,474 వరకు ఉన్నాయి. ఇందులో మైక్రో 2,182, చిన్న తరహా పరిశ్రమలు 1,094, మధ్యతరహా పరిశ్రమలు 62, భారీ పరిశ్రమలు 103, మెగా పరిశ్రమలు 9, మెగా ఇన్‌ఫ్రా 24 వరకు ఉన్నాయి. వీటిలో ఎక్కువగా బిహార్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సుమారు 37వేల మంది కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో కూడా సుమారు 300 పరిశ్రమలు ఉండగా ఇక్కడ కూడా వలస కార్మికులే అధికంగా ఉన్నారు. వలస కార్మిక సంక్షేమం, కనీస వేతనం, పని గంటల కోసం కేంద్రం అంతరాష్ట్ర వలస కార్మిక చట్టం 1979ను ప్రవేశపెట్టింది. ఈ చట్టం ప్రకారం వలస కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు, లేబర్ శాఖలో పేరు నమోదు లాంటి వాటిని అమలు చేయాల్సి ఉన్నా ఎక్కడా ఈ చట్టం అమలు కావడం లేదు.

వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి



మా రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉండవు. అందుకోసమే ఇక్కడికి వలస వచ్చి ఉద్యోగాలు చేస్తున్నాం. కానీ ఇలా జరుగుతుందని ఊహించలేదు. మా రాష్ట్రానికి చెందిన చిత్తరంజన్, రాంప్రకాష్, రఘుకాంత్ మరణించడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వారి తల్లి తండ్రులను పోషించుకోవడం కోసమే పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నారు. ఇలా జరగడంతో వారి కుటుంబం గడవడం కూడా కష్టంగా మారుతుంది.

- లాల్ మోహన్, కార్మికుడు, సౌత్ గ్లాస్ కంపెనీ

విధిలేక ఉద్యోగం చేస్తున్నాం



మా కుటుంబాలను పోషించుకోవడానికే ఇక్కడ పనిచేస్తున్నాం. పని భారం ఎక్కువగా ఉన్నా నెలకు జీతం మాత్రం రూ. 13 వేలు మాత్రమే ఇస్తున్నారు. వేతనాలు పెంచమని కోరితే ఉద్యోగం నుంచి తొలిగిస్తారన్న భయంతో అడగడం లేదు. ఉద్యోగాల్లోంచి తొలగిస్తే కుటుంబం గడవడం కూడా కష్టమవుతుందన్న ఉద్దేశంతోనే ఉద్యోగం చేస్తున్నాం.

-సంతోష్‌కుమార్, కార్మికుడు, సౌత్ గ్లాస్ కంపెనీ

పర్యాటక అభివృద్ధికి రూ.110 కోట్లు

- స్వచ్ఛ దర్శన్ పథకం నిధులు మంజూరు
- సమీక్షలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, జూన్ 29: జిల్లాలో పర్యాటక అభివృద్ధికి స్వచ్ఛదర్శన్ పథకం కింద రూ.110 కోట్లు మంజూరు అయ్యాయని, ఇట్టి నిధులతో 213 ఎకరాల్లో పనులు చేపట్టేందుకు ప్రణాళికల రూపొందించారని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని స్టేట్ ఛాంబర్‌లో అనంతగిరి పర్యాటక అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై అటవీ, దేవాదాయ, మిషన్‌భగీరథ, భూగర్భజలాల, మున్సిపల్ విభాగాల అధికారులతో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్‌లతో కలిసి స్పీకర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పనులతో పేదలకు ఉపాధి కలిగేలా ఉండాలని, అదేవిధంగాఆదాయ వనరులపై నివేదిక రూపొందించాలన్నారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చొరవతో కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్ ఏర్పాటుతో పర్యాటకుల రద్దీ పెరిగిందని, స్థానికులకు ఉపాధి దొరికిందని గుర్తు చేశారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అనంతగిరి ప్రాంత అభివృద్ధితో పాటు కోట్‌పల్లి, సర్పన్‌పల్లి, శివసాగర్, లక్నాపూర్ ప్రాజెక్టులు, దామగుండంప్రాంతాల అభివృద్ధికి కృషి చేయవలసిన అవసరం ఉందని అన్నారు. పర్యావరణ పర్యాటక అభివృద్ధిలో భాగంగా చేపట్టే వివిధ పనులను ఎల్ అండ్ టీ ప్రాజెక్ట్ మేనేజర్ సుమతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో నీటిపారుదల శాఖ జిల్లా అధికారి రేణుక, ఈఈ సుందర్, డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్, డీవైఎస్‌వో హనుమంతరావు, మత్స్య శాఖ అధికారి సౌజన్య, దేవాదాయశాఖ అధికారి నరేందర్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్



ధరణి సమస్యల పరిష్కారం వేగవంతం

మేడ్చల్ జూన్ 29(ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. ధరణి దరఖాస్తులపై శనివారం సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్‌లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులు, ఎన్ని పరిష్కరించినవి, పెండింగ్‌లో ఉన్నవి వివరాలు తెలియజేశారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు వివరించారు. రెవెన్యూ డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో పెండింగ్‌లోఉన్న దరఖాస్తులను వేగవంతంగా ప్రణాళికా బద్ధంగా పరిష్కరిస్తున్నట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

663 మందికి పదోన్నతులు




- వికారాబాద్ జిల్లాలో ముగిసిన ఉపాధ్యాయ ప్రమోషన్ల ప్రక్రియ
- చివరి అంకానికి చేరుకున్న ఎస్‌జీటీ బదిలీల అంశం
- రెండురోజుల్లో ముగియనున్న ఉపాధ్యాయుల బదిలీలు

వికారాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. ఇప్పటికే సీనియర్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించారు. ఆ తరువాత స్కూల్ అసిస్టెంట్లు, ఆ సమానస్థాయి కలిగిన ఉపాధ్యాయులకు బదిలీలు చేశారు. ఎస్‌జీటీలుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల్లో అర్హులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. అప్‌గ్రేడేషన్ పొందిన భాషా పండితుల బదిలీలు నిర్వహించి పోస్టింగులు ఇచ్చారు. ప్రభుత్వం చేపట్టిన పదోన్నతుల్లో జిల్లాలో మొత్తం 663 మందికి ఉద్యోగోన్నతి లభించింది. జీహెచ్ఎం పోస్టుల పదోన్నతులు మల్టీజోన్-2 పరిధిలో జరగగా, స్కూల్ అసిస్టెంట్, ఆ సమాన స్థాయి పదోన్నతులు జిల్లా స్థాయిలో జరిగాయి. జీహెచ్ఎం పదోన్నతుల్లో జిల్లాలో ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 94 జీహెచ్ఎం పోస్టులను భర్తీ చేయగా, 569 స్కూల్ అసిస్టెంట్లు, ఆ సమాన స్థాయి పదోన్నతులు కల్పించారు. అర్హులైన ఎస్‌జీటీల్లో పీఎస్ హెచ్‌ఎంలుగా 72 మందికి పదోన్నతులు కల్పించగా, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో బయో సైన్స్‌లో 40 మందికి, ఇంగ్లీష్‌లో 39, మ్యాథమెటిక్స్‌లో 30, ఫిజికల్ సైన్స్‌లో 9, సోషల్ స్టడీస్‌లో 49, స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఒకరికి పదోన్నతులు లభించాయి. భాషా పండితులు, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్‌తో జిల్లాలో హిందీలో 142, తెలుగులో 148, ఉర్దూలో 2, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 37మంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందారు. బదిలీల ప్రక్రియలో చివరగా ఎస్‌జీటీల బదిలీలు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. ఈ ఏడాది జూన్ ఒకటో తేదీ నాటికి ఒకే పాఠశాలలో ఎనిమిదేళ్లు పనిచేసిన ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ కానున్నారు. సీనియారిటీ ప్రాతిపదికన ఎస్‌జీటీలకు సీనియారిటీ ఆధారంగా పాయింట్లు కేటాయించగా, ప్రాధాన్య విభాగాలకు చెందిన వారైతే ప్రత్యేకపాయింట్లు ఇచ్చారు. తాత్కాలిక సీనియారిటీ జాబితాపై వచ్చిన అభ్యంతరాలను స్వీకరించి తప్పులు ఉంటే సవరించారు. శనివారం అర్ధరాత్రి ఉపాధ్యాయుల తుది సీనియారిటీ జాబితా ప్రకటించనున్నట్లు చెబుతున్నారు. సీనియారిటీ జాబితా విడుదల కాగానే బదిలీ కోసం ఆన్‌లైన్‌లో ఖాళీలను ఎంచుకునేందుకు వెబ్‌ఆప్షన్లు నమోదుచేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలోబదిలీల కోసం2700 మందికి పైగా ఎస్‌జీటీలు దరఖాస్తు చేసుకోగా, వారిలో తప్పనిసరిగా బదిలీ అయ్యే వారిలో 1713 మంది ఎస్‌జీటీలతో పాటు పలువురు ఎల్‌పీటీలు, ఎల్‌పీహెచ్‌లు, పీఈటీలు ఉన్నారు.

మీరేమంటారు?

రైతు భరోసా అమలుపై సర్కారు అభిప్రాయసేకరణ



- ప్రాథమిక సహకార సంఘాల సమావేశాలు ఏర్పాటు
- వచ్చేనెల 4వ తేదీ వరకు కార్యవర్గ సమావేశాలు
- రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించాలని ఆదేశం
- సాగుచేయని భూములు, ఎకరాల పరిమితిపైనే ఫోకస్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 29)

జూలై నెలలో రైతుభరోసా పథకం అమలు చేయాలని భావిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చురుకుగా చేస్తోంది. గతంలో మాదిరిగా కాకుండా కేవలం వ్యవసాయం చేస్తున్న రైతులకు మాత్రమే పంటసాయం అందించాలని భావిస్తున్న ప్రభుత్వం ఈ మేర చర్యలు మొదలు పెట్టింది. ఎన్నికల సమయంలో రైతులకు పంట సాయం ఎకరాకు రూ. 15వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇస్తామని ప్రకటించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎకరాకు పంట సాయం రూ.10వేల చొప్పున ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ మొత్తాన్ని రూ.15వేలకు పెంచుతామని కాంగ్రెస్ ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించింది. అలాగే రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ ఇస్తామని ప్రకటించింది. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన ఈ రెండు హామీలపై దృష్టి పెట్టింది. ఆగస్టు 15వ తేదీలోగా రుణమాఫీ చేస్తామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. అలాగే రైతుబంధు స్థానంలో రైతుభరోసా అమలు చేసేందుకు సర్కార్ కసరత్తు మొదలు పెట్టింది. అయితే వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే రైతుభరోసా అందించేందుకు సన్నాహాలు చేస్తోంది. అంతే కాక రైతుభరోసా పథకం ఎలా ఉండాలి? ఎవరికి ప్రయోజనం దక్కాలి? ఎమైనా పరిమితి పెట్టాలా? ఆదాయపన్ను కట్టే వారి విషయంలో ఏం చేయాలి? కౌలు రైతుల విషయంలో ఏం చేయాలి? అనేదానిపై క్షేత్రస్థాయిలో శనివారం నుంచి అభిప్రాయాలను సేకరిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు వేదికల్లో పాల్గొన్న రైతుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

వచ్చేనెల నాలుగు లోగా పూర్తి చేయాలి

తాజాగా ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది రైతుభరోసా పథకంపై క్షేత్రస్థాయిలో రైతుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ప్రాథమిక సహకార సంఘాల సమావేశాలు నిర్వహించాలని వ్యవసాయాధికారులను ప్రభుత్వం ఆదేశించింది. వచ్చేనెల 4వ తేదీ వరకు అన్ని ప్రాథమిక సంఘాల సర్వసభ్య సమావేశాలు నిర్వహించి రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి పంపాలని సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉంటే ఇటీవల రైతు వేదికల ద్వారా నిర్వహించిన సమావేశాల్లో రైతులు వ్యవసాయం చేసే రైతులందరికీ రైతుభరోసా ఇవ్వాలని , ఆదాయపన్నుతో సంబంధం లేకుండా దీన్ని కొనసాగించాలని కోరారు. అలాగే రియల్ ఎస్టేట్ వెంచర్లు, వ్యవసాయేతర అవసరాలకు వినియోగించే భూములకు సాయం ఇవ్వకూడదని సూచించారు. రైతుభరోసాకు వ్యవసాయ పరిమితిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పదెకరాల వరకు మాత్రమే సాయం అందించాలని ఎక్కువ మంది అభిప్రాయపడగా ఎకరాలతో సంబంధం లేకుండా సాగుచేసే భూములన్నింటికీ సాయం అందించాలని కొందరు కోరారు.

భారీగా తగ్గనున్న లబ్ధిదారులు

ఇదిలా ఉంటే గతంలో జిల్లా వ్యాప్తంగా 4,04,436 మంది రైతులను రైతుబంధు కింద లబ్ధిదారులుగా గుర్తించారు. అయితే ఇందులో 3,17,914 మంది రైతులు మాత్రమే ఆధార్ అనుసంధానం చేసుకున్నారు. వీరికి మాత్రమే సాయం అందచేశారు. ప్రభుత్వం తాజాగా తీసుకుని నిర్ణయంతో రైతుభరోసా లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయి. రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో ఇటీవల కాలంలో వేలాది ఎకరాల భూములు వ్యవసాయేతర భూములుగా మారాయి. పట్టణీకరణ నేపథ్యంలో హైదరాబాద్ శివార్లలోని వేలాది ఎకరాల్లో వెంచర్లు, ఇతర నిర్మాణాలు వచ్చేశాయి. దీంతో సాగు భూమి తగ్గిపోయింది. కానీ గత ప్రభుత్వం కొత్తపాస్‌బుక్‌లు ఉన్నవారందరికీ రైతుబంధు కింద సాయం అందచేసింది. వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలు ఉన్న ప్రాంతాలకు కూడా రైతుబంధు ఇవ్వడం గమనార్హం. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించడంతో లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా తగ్గనుంది.



కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

వికారాబాద్, జూన్ 29 : వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రతీక్ జైన్‌ను ఎస్పీ నారాయణరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శంషాబాద్ నుంచి బదిలీపై వచ్చిన ఎస్పీ నారాయణరెడ్డి శనివారం కలెక్టరేట్‌లో ప్రతీక్ జైన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 29: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఆయిల్ పామ్ తోటలను సాగుచేసే రైతులు ఆర్థికాభివృద్ధిని సాధిస్తారని తెలంగాణ రాష్ట్ర ఆయిల్‌పామ్ సలహాదారుడు డాక్టర్ బీఎస్ రావు అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని మధురాపురం గ్రామంలో శనివారం ఉద్యాన-పట్టు పరిశ్రమ శాఖ, వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ తోటల సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సుకు డాక్టర్ బీఎస్ రావు హాజరై రైతులనుద్దేశించి మాట్లాడారు. దేశంలో మంచినూనె కొరతను నివారిస్తూ.. రైతులకు ఆర్థిక పరిపుష్టి కల్గించాలన్న ఆలోచనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ తోటల సాగును ప్రోత్సహిస్తున్నదని అన్నారు. రంగారెడ్డి జిల్లాలోని నేలలు కూడా ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయని, 365 రోజులు సాగునీరు ఉన్న ప్రతీ రైతు ఆయిల్ పామ్ మొక్కలను నాటుకోవచ్చని తెలిపారు. ప్రతి ఎకరంలో చతురస్రాకారంలో నాటితే 50, త్రిభుజాకారంలో నాటితే 57 మొక్కలను నాటుకోవచ్చని తెలిపారు. నాటిన మూడు సంవత్సరాల తరువాత పంట ప్రారంభమై 30 ఏళ్ల వరకు ఆదాయాన్ని ఇస్తుందని, పంట చేతికొచ్చే వరకు


సదస్సులో మాట్లాడుతున్న బీఎస్ రావు

అంతరపంటగా కూరగాయలను సాగుచేసుకోవచ్చని సూచించారు. రంగారెడ్డి జిల్లాలో ఆయిల్ పామ్ మొక్కలను నాటించి, సంరక్షణతో పాటు పంటను కొనుగోలు చేసే బాధ్యతను వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రభుత్వం అప్పగించిందన్నారు. మొక్కనాటింది మొదలు పంట చేతికొచ్చే వరకు వాల్యూ అయిల్ కంపెనీ పర్యవేక్షణ చేస్తుందన్నారు. మొక్కనాటి మూడు సంవత్సరాల సంరక్షణ వరకు ప్రతి ఎకరానికి 65వేల రూపాయల వరకు ఖర్చు వస్తే, ప్రభుత్వం 52వేల రూపాయల సబ్సిడీని ఇస్తుందని, రూ.193 ధర ఉన్న మొక్కను రూ.20లకు ఇస్తారని తెలిపారు. ప్రతీ రైతు 12.20 ఎకరాల్లో సాగు చేసుకోవడానికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీపై, ఐదు ఎకరాల కంటే ఎక్కువున్న రైతులకు 80 శాతం సబ్సిడీపై డ్రిప్పును కూడా ఇస్తుందని తెలిపారు. మూడేళ్ల నుంచి వచ్చే పంటను కొనుగోలు చేసి.. 14 రోజుల్లో డబ్బులు ఇచ్చే బాధ్యత కూడా వాల్యూ అయిల్ కంపెనీదేనని తెలిపారు. 13 నుంచి 14వేలు టన్ను ధర ఉన్న పామ్ అయిల్ పంట.. ఎకరాకు 8 నుంచి 12 టన్నులు వస్తుందని తెలిపారు. ఖర్చులు పోను ప్రతి యేటా ఎకరంపై రూ.లక్ష ఆదాయం పొందవచ్చని తెలిపారు. వాల్యూ అయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామోహ్మాన్‌రావు మాట్లాడుతూ మనదేశం ప్రతీయేటా దిగుమతి చేసుకుంటున్న 150 లక్షల టన్నుల నూనెను స్వదేశంలోనే ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంతో ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. దేశ వ్యాప్తంగా 75 లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా నేటి వరకు 3లక్షల ఎకరాల్లోనే సాగుచేశారని, ఆయిల్ పామ్ సాగులో రైతులకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. షాద్‌నగర్ ఉద్యానశాఖ అధికారి ఉషారాణి, మధురాపురం మాజీ సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు భార్గవ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాకు ఆ ప్రధానోపాధ్యాయుడే కావాలి

● పాఠశాల హెచ్‌ఎంను బదిలీ చేయొద్దని డీఈవోకు వినతిపత్రం ఇచ్చిన మేడిపల్లికలాన్ వాసులు


వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

పూడూరు, జూన్ 29 : ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల్లో తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖాజా మైనుద్దీన్‌ను బదిలీ చేయొద్దని కోరుతూ మేడిపల్లికలాన్ గ్రామస్తులు డీఈవో రేణుకాదేవికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని మేడిపల్లికలాన్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోనాధ్యాయుడు ఖాజామైనుద్దీన్ ఉపాధ్యా బదిలీల్లో భాగంగా ట్రాన్స్‌ఫర్ అవుతున్నారు. విషయం తెలుసుకున్న కొందరు గ్రామస్తులు, యువకులు శనివారం డీఈవోను కలిసి ఖాజా మైనుద్దీన్‌ను బదిలీ చేయొద్దని, ఒకవేళ బదిలీ చేసినా డిప్యుటేషన్‌పై తిరిగి మా గ్రామ పాఠశాలకే పంపాలని కలెక్టర్ ప్రతిక్‌జైన్, డీఈవోను కోరారు. మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఎంసీ మాజీ చైర్మన్లు రవికుమార్, తుప్పరి రమేష్, మాజీ వైస్ చైర్మన్ ఉస్మాన్, పత్తి మల్లేశం, శశిధర్, షేర్‌ఖాన్, స్టమక్ రవి, రామకృష్ణారెడ్డి, తుప్పరి వెంకటేష్, శ్రీకాంత్, భూపాల్, అన్వర్, మోసిన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆ డాక్టర్ అందరికీ ఆదర్శం

● 158 సార్లు రక్తదానం చేసిన సంపత్ కుమార్

తాండూరు, జూన్ 29: పది, ఇరవై సార్లు కాదు.. తాండూరు పట్టణానికి చెందిన ఓ డాక్టర్ సాబ్ ఇప్పటివరకు 158సార్లు రక్తదానం చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. తాజాగా శనివారం డెలివరీకి సిద్ధంగా ఉన్న మహిళకు రక్తదానం చేశారు. తాండూరు పట్టణ శివారులోని ఎంపీహెచ్ (మాతా శిశు) ఆస్పత్రిలో కొడంగల్ ప్రాంతం దౌల్తాబాద్ గ్రామానికి చెందిన మద్దూర్ మహేష్ భార్య హర్షితకు రక్తం అవసరమైంది. ఆమె అన్న రాజు ఆ విషయాన్ని డాక్టర్ సంపత్‌కుమార్‌కు తెలిపారు. దీంతో ఆయన స్వయంగా ఆస్పత్రికి వచ్చి రక్త ఇచ్చారు. హర్షిత కుటుంబ సభ్యులు ఆ వైద్యుడికి కృతజ్ఞతలు తెలిపారు.


రక్తదానం చేస్తున్న డాక్టర్ సంపత్ కుమార్

దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రపై సినిమా

వికారాబాద్, జూన్ 29 : తెలంగాణ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం అమరుడైన దొడ్డి కొమురయ్య జీవిత చరిత్ర ఆధారంగా సినిమా నిర్మిస్తున్నామని, ఆయన పోరాట ప్రతిభను ప్రపంచానికి తెలిసేలా దొడ్డి కొమురయ్య పేరిట సినిమా తీయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఫిలిం డైరెక్టర్ సేనాపతి తెలిపారు. శనివారం శ్రీ వివేకవాణి విద్యాలయంలో సినిమా నిర్మాణ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం సినిమాలో నటించేందుకు గాను నటీనటులను, డ్యాన్సర్లను, గాయకులను ఎంపిక చేసే ప్రక్రియ చేపట్టారు. దర్శకుడు సేనాపతి మాట్లాడుతూ ప్రతీ జిల్లా నుంచి 30 మంది సహ నిర్మాతలకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణ వికారాబాద్ జిల్లా కమిటీ సహ నిర్మాతల కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ జిల్లా అధ్యక్షుడు జైదుపల్లి గోపాల్, భాస్కర్, వివేకావాణి విద్యాలయం కరెస్పాండెంట్ నాగయ్య, ప్యాట నర్సిములు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నటీనటులను ఎంపిక చేశారు. చిత్ర నిర్మాణ కోసం తమ వంతు సహాయంగా స్థానికులు దర్శకుడికి చెక్కును అందజేశారు.


చెక్కు అందజేస్తున్న స్థానికులు

'రైతు భరోసా'పై అభిప్రాయ సేకరణ

● రైతులతో సమావేశమైన అధికారులు

వికారాబాద్/పెద్దేముల్/కీసర, జూన్ 29 : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి పెట్టుబడి సాయం ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ తెలిపారు. శనివారం వికారాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని కొత్తగడి పీఏసీఎస్‌లో అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. రైతుల నుంచి రైతు భరోసాకు సంబంధించి అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రుణమాఫీ కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగడి పీఏసీఎస్‌లో సెక్రటరీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని రైతులు రుణాల కోసం వెళితే.. పాతవి కట్టే వరకు కొత్తవి ఇచ్చేది లేదని చెబుతున్నారని, ఆయన్ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దాంతో అధికారులు రైతులకు నచ్చజెప్పడంతో శాంతించారు. 10 ఎకరాల వరకు ఉన్న రైతులకు రైతు భరోసా ఇవ్వాలని, గ్రామాల్లో వెంచర్లు చేసిన వాటికి, ఎకరాలకు ఎకరాలు కొనుగోలు చేసి పడావుగా(ఖాళీగా) ఉన్న భూములకు రైతు భరోసా సాయం అందివ్వద్దని రైతులు సూచించారు. సొసైటీ చైర్మన్ సుభాన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నర్సిములు, ఏవో జ్యోతి, సొసైటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ విక్రమ్, సీఈవో ఖాదర్, ఏఈవో అనిల్ తదితరులున్నారు. పది ఎకరాల లోపు భూమి ఉన్నవారికి మాత్రమే రైతుభరోసా అందించాలని పెద్దేముల్ మండలంలోని రైతులు అభిప్రాయాలు వెల్లడించారు. పెద్దేముల్, తట్టిపల్లి సొసైటీలలో రైతు భరోసా సాయంపై రైతుల నుంచి సూచనలు, సలహాలు కోరుతూ అభిప్రాయ సేకరణ చేపట్టారు. కాగా, పది ఎకరాల లోపు సాగు ఎంత చేస్తే అన్ని ఎకరాలకు మాత్రమే రైతు భరోసా అందించాలని సూచించారు. కోట్లు ఖర్చుపెట్టి ఎమ్మెల్యేలు, ఎంపీలుగా చలామణి అవుతున్న వారికి సాయం ఇవ్వాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. పారిశ్రామికవేత్తలు, ఫాంహౌజ్‌లు కట్టుకున్న వారికి, రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు ఇవ్వరాదని తెలిపారు. డీసీవో ఈశ్వరయ్య, సొసైటీ చైర్మన్లు లక్ష్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఆర్ చంద్రయ్య, ఏడీఏ రుద్రమూర్తి, ఏవో నజీరుద్దీన్, ఎఫ్ఎస్‌సీఎస్ మేనేజర్ మురళిగౌడ్ పాల్గొన్నారు. రైతుభరోసాను సాగుచేసే భూములకే వర్తింపజేయాలని పలువురు రైతుల అభిప్రాయాలు తెలిపారు. కీసర సహకార సంఘం చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన రైతు భరోసా పథకంపై మహాజన సమావేశం నిర్వహించారు. డీసీవో రాజేందర్ పాల్గొని మాట్లాడుతూ 15వ తేదీ వరకు రైతు భరోసాపై అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. వ్యవసాయం చేసే రైతులకే రైతు భరోసా అందించాలని, కౌలు రైతులకు, వ్యవసాయం చేయని భూములకు రైతు భరోసా ఇవ్వకూడదని మెజార్టీ రైతులు తమ అభిప్రాయాలను తెలిపారు. సహకార సంఘం వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, డైరెక్టర్లు రైతుల పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

పరిగి, జూన్ 29: శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి అన్నారు. పరిగిలో శనివారం రాత్రి కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఆర్‌సీలు, లైసెన్స్‌లు లేని పలు వాహనాలను సీజ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు సంతోష్ పాల్గొన్నారు.

రెండు మీసేవా కేంద్రాలు మంజూరు

బషీరాబాద్, జూన్ 29: మండలానికి రెండు మీ-సేవా కేంద్రాలు మంజూరైనట్లు బషీరాబాద్ ఐకేపీ ఎపీఎం పద్మారావు తెలిపారు. ఎక్మాయి, మైల్వార్ గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని అర్హులైన మహిళలకు ఈ మీసేవా కేంద్రాలు కేటాయించనున్నట్లు తెలిపారు. డీఆర్‌డీవో అధికారుల ఆదేశానుసారం ఆగస్టు 15లోగా ప్రక్రియ పూర్తి చేసి మీ సేవా కేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మొహర్రం సందర్భంగా ఆటపాటలు

యాలాల, జూలై 17వ తేదీన మొహరం పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో ముందస్తు వేడుకలు నిర్వహించారు. మహిళలు సాయంత్రం వేళలో ఆట పాటలతో నిమగ్నం అవుతున్నారు. మాజీ సర్పంచ్‌లు హన్మంతు ముదిరాజ్, శ్రీలత ముదిరాజ్, వెంకటేశ్వర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కృషి

వికారాబాద్, జూన్ 29: శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కృషి చేద్దామని, దేశంలో ఒకే రాజ్యాంగం, ఒకే ప్రధాని ఉండాలనే నినాదంతో చలో కశ్మీర్‌కు పిలుపునిచ్చి అక్కడికి వెళ్లి జైల్లోనే బలిదానమైన జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. ఆయన జయంత్యుత్సవాల్లో భాగంగా శనివారం బీజేపీ జిల్లా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. శివరాజ్, నాయకులు శిరీష, పాండు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి



సన్మానం పొందిన అధికారులతో ఎస్పీ



కమిషనర్ దంపతులను సన్మానిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

వికారాబాద్, జూన్ 29 : ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది తప్పక ఉంటుందని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శనివారం ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురు ఎస్సైలు హతీరామ్, ఎ.నర్సిములు, ఎండీ యూనుస్‌లను ఎస్పీ సన్మానించారు. అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, తాండూరు డీఎస్పీ బాలకృష్ణరెడ్డి, ఏఆర్‌డీఎస్పీ వీరేశ్, ఎస్సైలు, ఆర్‌ఐలు, పోలీస్ జిల్లా అధ్యక్షుడు అశోక్ పాల్గొన్నారు.

దోమ: మండలంలోని అయినాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా ఎంఈవో హరిశ్చందర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు బాలు, చందు, మేఘ్య, రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఘన వీడ్కోలు

మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కమిషనర్ రాములు శనివారం ఉద్యోగ విరమణ పొందడంతో ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వీడ్కోల సభకు స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ హాజరై కమిషనర్ రాములు దంపతులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీఐలో ఐదుగురి ఉద్యోగ విరమణ

తాండూరు రూరల్: తాండూరు మండలం ప్రభుత్వరంగ సీసీఐ కర్మాగారంలో ఐదుగురు ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందారు. వీరిలో ముగ్గురు పర్మినెంట్ ఉద్యోగులు కాగా, మరో ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారు. ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్‌లో హెచ్‌వోడీ మోహన్‌రావు, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో హెచ్‌వోడీ రమణమూర్తి, ఇన్‌స్ట్రుమెంట్ విభాగంలో రహ్మాన్, కాంట్రాక్టర్ల విభాగంలోని ఎలక్ట్రికల్‌లో శేఖర్, మైనింగ్ డిపార్ట్‌మెంట్‌లో రాంబాబు పదవీ విమరణ పొందారు. ఆదివారం సీసీఐ కర్మాగారంలోని కమ్యూనిటీ హాల్‌లో వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా, తాండూరు మండలం కరన్‌కోట్ సీసీఐ ప్రభుత్వ రంగ కర్మాగారంలో మెకానికల్ హెచ్‌వోడీగా పనిచేస్తున్న విపుల్‌కుమార్ రాజ్‌బన్ సీసీఐ కర్మాగారానికి జీఎం టెక్నికల్ విభాగానికి ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు.

పంచాయతీరాజ్ విభాగంలో..

పంచాయతీరాజ్ విభాగంలో యాలాల, బషీరాబాద్ మండలాల డీఈఈ కరుణాకర్‌చారి, తాండూరు డివిజన్ ఈఈ కార్యాలయంలో పనిచేసిన డీఈఈ గోపినాథ్‌లు పదవీ విరమణ పొందారు. శనివారం తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్ సిబ్బంది, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు, శాలువా, పూలమాలతో సన్మానించారు. సమావేశంలో వికారాబాద్, తాండూరు వీఆర్‌ఏలు శ్రీరాములు, ఉమేష్, బషీరాబాద్, యాలాల, ఎంపీపీలు కరుణ, బాలేశ్వర్‌గుప్తా, డీఈలు వెంకట్‌రావు, సుదర్శన్‌రెడ్డి, జితేందర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న సీపీ తరుణ్ జోషి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 29 : నూతన నేర, న్యాయ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రాచకొండ పోలీసు కమిషనర్ తరుణ్ జోషి అన్నారు. జూలై 1 నుంచి భారత ప్రభుత్వ నూతన నేర, న్యాయ చట్టాలు-2023 అమలులోకి రానున్న నేపథ్యంలో కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన విధానాలపై రాచకొండ పరిధిలోని పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బందికి శనివారం మండలంలోని అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజనీరింగ్ కళాశాలలో హైకోర్టు అడ్వకేట్ సురేష్ అవగాహన కల్పించారు. సీపీ మాట్లాడుతూ నేర, న్యాయ చట్టాల ద్వారా దేశ అంతర్గత భద్రతలో నూతన శకం ప్రారంభం కానున్నదని, కేసుల దర్యాప్తు విధానం, విచారణ పద్ధతుల్లో మార్పులు వస్తాయన్నారు. డీసీపీలు పద్మజారెడ్డి, రాజేష్‌చంద్ర, ప్రవీణ్, కరుణాకర్, సునీతారెడ్డి, అరవింద్ బాబు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవ్వాలి

పరిగి,జూన్ 29: పార్లమెంట్ ఎన్నికల్లో చూపిన స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవ్వాలని బీజేపీ ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెన్నె ఈశ్వరప్ప కోరారు. పరిగిలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మోదీ హ్యాట్రిక్ ప్రధాని కావడంతో బీజేపీ మరింత బలోపేతమైందన్నారు. పరిగి చరిత్రలోనే మొదటిసారిగా బీజేపికి మెజార్టీ రావడం కార్యకర్తల కృషి ఫలితమేనని తెలిపారు. కాంగ్రెస్ ఏడు నెలల పాలనలోనే విఫలమైందని విమర్శించారు. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ కులగణన చేస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటి వరకు ఏమైందని ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో 22 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్‌లకు 45శాతానికి పెంచుతామని చెప్పారని, అయితే ఇప్పటి వరకు ఆ ప్రక్రియనే ప్రారంభించలేదన్నారు. బీసీ కులగణనను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపి జిల్లా ప్రధానకార్యదర్శి రాంచందర్, జిల్లా ఉపాధ్యక్షుడు వి.పెంటయ్య, వి.రాముయాదవ్, ఓబీసీసెల్ పరిగి తాలుకా అధ్యక్షుడు విజయ్‌కుమార్, పరిగి పట్టణ అధ్యక్షుడు బాలకిష్టారెడ్డి, ఓబీసీ సెల్ అధ్యక్షుడు టీవీ నర్సింహులు, నాయకులు కె.శ్రీశైలం, వెంకటేశ్, సాయబన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నె ఈశ్వరప్ప

సాయిచంద్ మృతి తీరని లోటు

కొడంగల్, జూన్ 29: ప్రముఖ జానపద కళాకారుడు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ సాయిచంద్ మృతి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హస్తినాపూరం జీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన సాయిచంద్ ప్రథమ వర్థంతి సభలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. అదే విధంగా కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యు.రమేశ్‌బాబు ఆధ్వర్యంలో సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు



సాయిచంద్ వర్థంతి సభలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

బీసీ హాస్టల్‌లో అన్ని సదుపాయాలు కల్పించాలి

నవాబుపేట, జూన్ 29: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో అన్ని సదుపాయాలు కల్పించాలిన జడ్పీ సీఈవో సుధీర్ అన్నారు. శనివారం ఆయన హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టల్‌కు విద్యుత్ సరఫరా లేకపోవడంతో దోమల బెడద ఉందని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా వార్డెన్ సుమలతను నిలదీశారు. మీ ఇంటిలో ఇలాగే విద్యుత్ సరఫరా లేకపోతే ఎలా ఉంటారని ప్రశ్నించారు. విద్యార్థులకు హాస్టల్‌లో అన్ని సదుపాయాలు, నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. వర్షం పడితే చాలు హాస్టల్‌లోకి నీరు వస్తుందని ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. విద్యుత్ మరమ్మతులు చేయించాలని ఎంపీడీవో అనురాధను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ గాండ్ల చంద్రశేఖర్, వార్డెన్ సుమలత, పంచాయతీ కార్యదర్శి నవనీత తదితరులు ఉన్నారు.



బీసీ హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న జడ్పీ సీఈవో సుధీర్

నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాల విక్రయం సరికాదు

మేడ్చల్ టౌన్, జూన్ 29: నిబంధనలకు విరుద్ధంగా సీఎంఆర్ పాఠశాల యాజమాన్యం పుస్తకాలను విక్రయిస్తోందని, ఈ పద్ధతి సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ అన్నారు. శనివారం మేడ్చల్ పట్టణం కేఎల్ఆర్ వెంచర్‌లోని సీఎంఆర్ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు విక్రయించరాదన్న ప్రభుత్వ నిబంధనను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు.అధికారులు స్పందించకుంటే డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంఈవోకు ఫిర్యాదుచేయగా అధికారులు వెళ్లి పాఠశాలలో నోట్‌బుక్స్, యూనిఫాం ఉంచిన గదిని సీజ్ చేశారు. నాయకులు కిరణ్, బాల్‌కిరణ్, అరుణ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌లో సహజ యోగా ధ్యానం

మేడ్చల్ టౌన్, జూన్ 29: గుండ్లపోచంపల్లి మున్సిపల్ కండ్లకోయ పరిధిలో గల సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సహజ యోగా ధ్యాన కేంద్రం వారి ఆధ్వర్యంలో సహాయ యోగ ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ధ్యాన కార్యక్రమంలో 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల వైస్‌చైర్మన్ భూపాల్‌రెడ్డి, సెక్రటరీ శ్రీశైలంరెడ్డి, ప్రిన్స్‌పాల్ డా.శ్రీనివాసుల రెడ్డి, హెచ్‌వోడీ కె.వి.రెడ్డి, కోఆర్డినేటర్ విఘ్నేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సీఎంఆర్ ప్రిన్సిపాల్ శ్రీనివాసుల రెడ్డి

పవన్ కల్యాణ్‌కు నీరాజనం

శామీర్‌పేట, జూన్ 29: ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కొండగట్టు అంజన్నను దర్శించుకోవడానికి వెళ్తూ మార్గమధ్యంలో రాజీవ్ రహదారిలో గల శామీర్‌పేట మండలం తుర్కపల్లిలో కాసేపు ఆగారు. జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పవన్‌కు నీరాజనం పలికారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరులకు జైఅంటు జోహార్లు తెలిపారు. అభిమానులు, కార్యకర్తలు భారీ ఖడ్గాన్ని బహూకరించారు. అదేవిధంగా భారీ గజమాలను వేసి ఘనంగా సన్మానించారు.



రెస్టారెంట్లు, హోటళ్లు నిబంధనలు పాటించకుంటే చర్యలు

కొడంగల్, జూన్ 29: రెస్టారెంట్లు, హోటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను కస్టమర్లకు ఇవ్వడం సరైంది కాదని, అలాంటి హోటళ్లు, రెస్టారెంట్‌లపై చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ హెచ్చరించారు. కొడంగల్ పట్టణ శివారులోని యాద్గీర్ రోడ్డులో గల ఎస్‌వీఆర్ రెస్టారెంట్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో కిచెన్ రూంలో అపరిశుభ్రంగా ఉండటం, ఫ్రిజ్‌లో నిల్వ ఉన్న చికెన్ తదితర వాటిని గుర్తించారు. రెస్టారెంట్‌ను అనుమతులు లేకుండా కొనసాగించడం సరైంది కాదన్నారు. రెండు రోజుల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అధికారులతో కలిసి కొడంగల్ మున్సిపల్ పరిధిలోని అన్నీ హోటళ్లు, రెస్టారెంట్‌లలో తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఇక నుంచి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి బదిలీ ఆపాలి

కొడంగల్ రూరల్, జూన్ 29: కొడంగల్ మండలంలోని ఇందనూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గత 12 సంవత్సరాలుగా హెచ్‌ఎంగా పని చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల బదిలీపై మన్నెగూడ పాఠశాలకు వెళ్లారు. దీంతో ఆగ్రామ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు శనివారం కొడంగల్ ఎమ్మార్సీ కేంద్రానికి వచ్చారు. ఎంఈవో జిల్లా కేంద్రానికి వెళ్లడంతో వినతి పత్రాన్ని ఎమ్మార్సీ సిబ్బందికి అందించారు.

ఉద్యోగోన్నతులు కల్పించాలి

దోమ, జూన్ 29: ఉద్యోగోన్నతుల్లో 4590 పీఎస్ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేసి సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు వెంటనే ఉద్యోగోన్నతి కల్పించాలని పీఆర్‌టీయూ దోమ మండల అధ్యక్షుడు ఆర్.కేశవులు, ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో హామీ ఇచ్చి నెర్చకపోవడం శోచనీయమన్నారు.

ఖర్గేను కలిసిన తాండూరు ఎమ్మెల్యే

తాండూరు, జూన్ 29: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. ఈమేరకు శనివారం ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేశారు. వారితో పాటు సీనియర్ నాయకుడు ఎ.చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

● **బషీరాబాద్:** రైతు భరోసా పథకం అమలుపై నేడు(ఆదివారం) నవాంద్గీ సొసైటీ ఆధ్వర్యంలో రైతులతో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆసంఘం చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి తెలిపారు.

● **యాలాల:** పగిడ్యాల పంచాయతీని డీపీవో డాక్టర్ జయసుధ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె వెంట ఎంపీవో యాదయ్య ఉన్నారు.

● **నవాబుపేట:** చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం సరైంది కాదని పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొండల్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ఆమరణ నిరాహారదీక్ష చేపట్టగా పోలీసులు అరెస్టు చేశారు.

● **మోమిన్‌పేట్:** ఎన్కతలలో సర్వే నెం.214లో 1 ఎకరాల 32 గుంటల చెరువు భూమిలో సుధీర్ రాజు 15గుంటల భూమిని ఆక్రమించుకున్నాడు. విషయాన్నిగ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా శనివారం సర్వేయర్లు భూమిని సర్వే చేశారు.

● **మర్పల్లి:** మర్పల్లి మండల కేంద్రంలోని తైబజార్‌ను రూ.4లక్షల 50వేలకు వేలం నిర్వహించినట్లు మర్పల్లి తహసీల్దార్ గణేశ్ తెలిపారు. శనివారం మర్పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన వేలంలో గోవింద రాజు అనే వ్యక్తి రూ.4లక్షల 50వేలకు దక్కించుకున్నాడు.

● **కులకచర్ల:** తైబజార్ వేలం శనివారం తహసీల్దార్ మురళీధర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా గ్రామానికి చెందిన వెంకట్రాములు రూ.7,01,100 పొందారు.

● **కులకచర్ల:** ఘనపూర్‌లో రామలింగేశ్వర గోశాలు, శివాలయ నిర్మాణానికి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెన్న ఈశ్వరప్ప రూ.2లక్షలు విరాళాన్ని శనివారం అందజేశారు.

● **పరిగి:** మండల పరిషత్ పాలకవర్గం పదవికాలం జూలై నాలుగుతో పూర్తి కానుండడంతో శనివారం పరిగి మండల పరిషత్‌లో సన్మానకార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ అరవింద్‌రావు, జడ్పీటీసీ బి.హరిప్రియప్రవీణ్‌రెడ్డిల తోపాటు ఎంపీటీసీలు వివిధ శాఖల అధికారులకు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

● **పరిగి:** బీజేపి ఓబీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, సేవారత్న అవార్డుగ్రహీత, పరిగి ప్రాంతవాసి వెన్నె ఈశ్వరప్ప డాక్టరేట్ పట్టా వచ్చిన సందర్భంగా శనివారం పరిగిలోని ఆయనను బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రాంచందర్, జిల్లా ఉపాధ్యక్షుడు వి.పెంటయ్య తదితరులు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

● **వికారాబాద్:** బార్ అసోసియేషన్ కార్యాలయంలో వారు న్యాయవాది పరిషత్ జిల్లా కార్యవర్గం ఎన్నికలు శనివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా జి.కృష్ణారెడ్డిని (పరిగి) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మురళీ నామాజీ, వై.విశ్వనాథ్, పి.వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.మహేశ్వర్ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా చంద్రశేఖర్, పాండురంగారెడ్డి, రాజు, కోశాధికారిగా రామచంద్రారెడ్డి ఎన్నికయ్యారు.

● **వికారాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని ఏబీవీపీ వికారాబాద్ టౌన్ జనరల్ సెక్రెటరీ జగదీశ్ చారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

● **శామీర్‌పేట:** రైతుల అభ్యున్నతి కోసం తాను నిరంతం బాధ్యతగా కృషి చేస్తున్నట్లు చైర్మన్, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ రామిడి మధుకర్‌రెడ్డి అన్నారు. శనివారం శామీర్‌పేటలోని రైతు సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్ రామిడి మధుకర్‌రెడ్డి అధ్యక్షతన ఉమ్మడి శామీర్‌పేట మండల రైతు సర్వసభ్యసమావేశాన్ని నిర్వహించారు. సంఘం వైస్‌చైర్మన్ ఐలయ్య, డైరెక్టర్లు, సీఈవో నర్సింలు, రైతులు పాల్గొన్నారు.

● **ధారూరు:** బీజేపీ సీనియర్ నాయకుడు నర్సింహులు శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ వికారాబాద్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వి.నందు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజ నాయక్‌లు నాగసముందర్ చేరుకుని ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5వేలు అందజేశారు.

● **పరిగి:** మండల పరిషత్‌లో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అరవింద్‌రావు ఆయన మాట్లాడుతూ ఈ పాలకవర్గం పీరియడ్‌లో రూ.కోటి 60లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ బి.హరిప్రియప్రవీణ్‌రెడ్డి, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

● **కీసర రూరల్:** నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్ శనివారం పలు వార్డుల్లో సందర్శించారు. సత్యనారాయణ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కాలనీ వాసులతో కలిసి వీధుల్లో ఊడ్చి చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో నాయక్, రాహుల్‌రెడ్డి పాల్గొన్నారు.

● **పరిగి:** న్యాయవాది పరిషత్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పరిగికి చెందిన జి.కృష్ణారెడ్డిని శనివారం జరిగిన న్యాయవాదుల సమావేశంలో ఎన్నుకున్నారు. సభ్యులుగా ఆనంద్‌గౌడ్, నర్సింహ్మారావు, జింకల యాదయ్య తదితరులు ఎన్నికయ్యారు.

● **బషీరాబాద్:** ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని ఇకపై ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించున్నట్లు బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ తెలిపారు.

● **మోమిన్‌పేట్:** ప్రతీ సోమవారం ఉదయం 10:30 గంటలకు ప్రజావాణి నిర్వహించనున్నట్లు ఎంపీడీవో యాదగిరి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● **దోమ:** దోమ మండల పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్‌గా కుమ్మరి దస్తయ్య ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి బిచ్చిరెడ్డి తెలిపారు. శనివారం దస్తయ్యకు నియామకపత్రాన్ని అందజేశారు.

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల నలుగురి ఆత్మహత్య

మేడ్చల్ టౌన్, జూన్ 29: వేర్వేరు చోట్ల నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనలు మేడ్చల్, వికారాబాద్, కులకచర్ల పరిధిలో చోటుచేసుకున్నాయి. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓవ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ పట్టణం రాఘవేంద్రనగర్ కాలనీకి చెందిన వీరేంద్రచౌహాన్ శనివారం తన నివాసంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి యువకుడు..

వ్యక్తిగత కారణాలతో మేడ్చల్ పట్టణానికి చెందిన ఓ యువకుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ రైల్వేస్టేషన్ సమీపంలోని రైలు పట్టాలపై మేడ్చల్ పట్టణానికి చెందిన శ్రీనివాస్ అనే యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. దీంతో వెంటనే రైల్వే పోలీసులకు సమాచారాన్ని అందించారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంతారంలో వ్యక్తి..

కులకచర్ల: మండలంలోని అంతారంలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చౌట వెంకటయ్య(65) శనివారం తన ఇంటి రేలింగ్‌కు వైర్ తాడును మెడకు బిగించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నాడు. కాగా, వెంకటయ్య ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. అందరితో కలుపుగోలుపుగా ఉండేవాడని, వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకొని ఉంటాడని గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారులు ఉన్నారు. ఈ సంఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడు..

వికారాబాద్: ప్రేమించిన అమ్మాయి దూరం కావడంతో మనస్తాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ పట్టణం ప్రతాప్‌గిరి కాలనీకి చెందిన కాలే సుజాత భర్త కిష్టయ్యకు ఇద్దరు కుమారులు. ఈ కుటుంబం హైదరాబాద్‌లోని ప్రతాప్‌గిరి కాలనీలో ఉంటూ జీవిస్తుండగా మూడు నెలల కిందట వికారాబాద్ కు వచ్చారు. వీరి చిన్నకుమారుడు తరుణ్(20) హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయి దూరం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలోనే శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికివచ్చిన కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు తల్లి కాలే సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొడంగల్ రూరల్, జూన్ 29: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన కొడంగల్‌లో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ శివరాములుగౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంగడిరైచూర్ గ్రామానికి చెందిన కవిటి బందెప్ప(50) పని నిమిత్తం దౌల్తాబాద్‌కు బైక్‌పై వెళ్లి తిరుగు ప్రయాణంలో గ్రామానికి వస్తుండగా అంగడిరైచూర్ గేటు సమీపంలోని దాబా దగ్గర కొడంగల్ నుంచి వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో బందెప్ప తీవ్రగాయాలతో కిందపడిపోయాడు. అదే క్రమంలో గుర్తుతెలియని వాహనం పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితుల రిమాండ్

దౌల్తాబాద్, జూన్ 29: హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బిచ్చాల్ గ్రామానికి చెందిన రేణుకతో అడిగే అనిల్ ఆరు నెలల నుంచి వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. రేణుక భర్త అశోక్ హైదరాబాద్‌లో పాప్‌కార్న్ అమ్ముకొని వచ్చిన డబ్బులను తన భార్య పిల్లలను పోషించేవాడు. ఈ క్రమంలో 5 నెలల కిందట అశోక్ హైదరాబాద్ నుంచి ఇంటికి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. దీంతో అశోక్ అడ్డు తొలగించుకునేందుకు ఈనెల 12న రాత్రి అశోక్ తన ఇంట్లో నిద్రించిన సమయంలో అర్ధరాత్రి రేణుక, అనిల్‌లు ఇద్దరు కలిసి అశోక్ గొంతు నులిమి హతమార్చారు. ఎవరికీ అనుమానం రాకుండా మరుసటి రోజు ఉదయం అశోక్ మద్యం సేవించి మృతిచెందాడని నమ్మించి ఈనెల 13వ తేదీన అందరి సమక్షంలో అంత్యక్రియలు పూర్తిచేశారు. అయితే, అశోక్ సోదరుడు నర్సింహులు తన తమ్ముడి మృతిపై అనుమానం కలిగి ఈనెల 18వ తేదీన దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే అశోక్‌ను రేణుక, అనిల్ కలిసి పథకం ప్రకారం హత్య చేసినట్లు వెల్లడైంది. ఈ మేరకు ఇద్దరు నిందితులను కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

వ్యక్తి అదృశ్యం

మోమిన్‌పేట్, జూన్ 29: మోమిన్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యం కాగా ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రాళ్లగూడుపల్లి అనుబంధ గ్రామం గుట్టమీది తండాకు చెందిన మెగావత్ శ్రవణ్(54) కూలిపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కూతురి వివాహం జరగగా కుమారుడు గత సంవత్సరం మృతి చెందాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసైన శ్రవణ్ భార్యతో గొడవపడటంతో భార్య పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో శ్రవణ్ ఈనెల 2వ తేదీన గ్రామం నుంచి కూలీపనికి వెళ్తానని చెప్పి వెళ్లిపోయాడు. రోజూ మాదిరిగా వస్తాడనుకున్నా తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ కోసం తెలిసిన వారి దగ్గర, బంధువుల దగ్గర వెతికినా ఫలితం లేకుండా పోయింది. శనివారం శ్రవణ్ కుటుంబ సభ్యుడు మెగావత్ జయేందర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అరవింద్ తెలిపారు. మెగావత్ శ్రవణ్ అచూకీ ఎవరికైనా తెలిస్తే 9666846445, 9963417411, 9550595694 సెల్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో పీఏసీఎస్ డైరెక్టర్‌కు తీవ్ర గాయాలు

తాండూరు రూరల్, జూన్ 29: కుక్కను తప్పించబోయి బైక్ బోల్తాపడిన సంఘటనలో పీఏసీఎస్ డైరెక్టర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పట్టణంలోని రాజీవ్ గృహకల్ప వద్ద శనివారం ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అంతారం గ్రామానికి చెందిన పెండ్యా నర్సింహులు ఎల్మకన్నె సహకార సంఘంలో డైరెక్టర్‌గా కొనసాగుతున్నాడు. ఇటీవల పట్టణ శివారులోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నర్సింహులు శనివారం ఉదయం అంతారం నుంచి బైక్‌పై ఆస్పత్రికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో రాజీవ్ గృహకల్ప వద్ద బైక్‌కు కుక్క అడ్డువచ్చింది. ఈ క్రమంలో నర్సింహులు బైక్‌పై నుంచి పడి ముఖం, తల, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. దీంతో ఆయనను స్థానికులు పట్టణంలోని జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పొట్టేళ్లు చోరీ

పూడూరు, జూన్ 29: మండలంలోని కంకల్‌లో పొట్టేళ్లు చోరీకి గురయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కంకల్ గ్రామంలోని గొల్ల గాలయ్యకి చెందిన ఏడు పొట్టేళ్లు, మూడు చిన్న పొట్టేళ్లను వీరభద్రవైన్స్ ముందున్న ఖాళీస్థలంలో కట్టేశాడు. రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వాటిని దొంగలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదనరెడ్డి పేర్కొన్నారు.

ధారూరులో వర్షం

ధారూరు, జూన్ 29: ధారూరు పరిసర ప్రాంతంలో శనివారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. విత్తిన పంటలకు సరిపోయేటంత వర్షం కురువలేదని రైతులు తెలిపారు.